RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 12 సంచిక : 350 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 22 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్




## రుణమాఫీకి నిర్ణయం తీసుకున్న రేవంత్ కేబినెట్

హైదరాబాద్ : తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 2023 డిసెంబర్ 9కి ముందు రైతులు తీసుకున్న రుణాలపై మాఫీ వర్తింప చేస్తారు. . పార్లమెంట్ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించారు. ఆరు గ్యారంటీల్లో రుణమాఫీ కూడా కీలకమైన హామీగా ఉంది. రుణమాఫీకి సంబంధించి రూ. 39 వేల కోట్లు అవసరమని అంచనా వేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి మహారాష్ట్ర, రాజస్థాన్ లో పలువురు అధికారులు పర్యటించి అధ్యయనం చేశారు. రుణమాఫీకి ఎలాంటి నియమ నిబంధనలు పెట్టాలన్నదానిపై విస్తృతంగా చర్చలు జరిపారు. కేంద్రం అమలుచేస్తున్న పీఎం కిసాన్ పథకం నిబంధనలను రుణమాఫీకి వర్తింపచేయాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. రుణమాఫీ విధివిధానాలను కేబినెట్ భేటీ తర్వాత ప్రకటించే అవకాశం ఉంది. పీఎం కిసాన్ యోజన నిబంధనలను వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే సీఎం మొదలు ఎమ్మెల్యే వరకు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను కడుతున్నవారికి రుణమాఫీ అందదు. ఇలాంటి ఆంక్షలతో ఎంత మంది ఫిల్టర్ అవుతారు, ప్రభుత్వానికి ఏ మేరకు భారం తగ్గుతుందన్న లెక్కలపై కూడా అసెంబ్లీలో చర్చించారు. అవసరమైన పేద రైతులకు మాత్రమే రుణమాఫీ చేయలని ధనవంతులకు చేయడం వల్ల ఉపయోగం ఉండదని అంచనా వేసినట్లుగా తెలుస్తోంది. రుణమాఫీకి అవసరమైన నిధులపైనా కేబినెట్లో చర్చించినట్లుగా తెలుస్తోంది. రుణమాఫీ కోసం కార్పొరేషన్ను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం పరిశీలన జరిపింది. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వచ్చే రుణం, ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి రాకుండా ఉండాలంటే అనుసరించిన విధానం తదితర అంశాలపై ఇప్పటికే పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వాటిపైనా కేబినెట్లో చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో అతి ముఖ్యమైన హామీ రూ. 2 లక్షల రుణమాఫీ. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇస్తామని కాంగ్రెస్ తెలిపింది. అయితే అధికారం చేపట్టిన తర్వాత సరిపడా నిధులు లేక రుణమాఫీ అమలు ప్రక్రియను ప్రారంభించలేదు. అలాగే లోక్ సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇది మరింత ఆలస్యమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ మాటను నిలబెట్టుకునే దిశగా కార్యచరణ చేపడుతున్నారు.



## తెలంగాణ ప్రగతిపై ప్రపంచ ప్రఖ్యాత మ్యాగజైన్ ది ఎకానమిస్ట్ కథనం

హైదరాబాద్ : కొత్త రాష్ట్రమైన తెలంగాణ పదేళ్లలో అద్భుతమైన ప్రగతిని సాధించి.. మరిన్ని కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేసేందుకు ఒక సక్సెస్‌ఫుల్‌గా మోడల్ అయ్యిందంటూ ప్రపంచంలోని ప్రఖ్యాత మ్యాగజైన్ ది ఎకానమిస్ట్ కథనాన్ని ప్రచురించింది. ఇప్పటికైనా పదేళ్ల తెలంగాణ ప్రగతి ప్రస్థానంపైన బురద జల్లడం మానుకొని, అభివృద్ధి యజ్ఞాన్ని ముందుకు తీసుకుపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఒక అభివృద్ధి మోడల్‌గా తయారైదంటూ కథనంలోని లెక్కలను కేటీఆర్ ట్వీట్ చేశారు.

**తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలు :** తెలంగాణ ఏర్పడిన నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యం 7.8 గిగావాట్లు నుంచి 19.3 గిగావాట్లకుకి పెరిగింది. ఐటీ ఎగుమతులు 2014 నుంచి 2023 వరకు 9 ఏళ్లలో నాలుగు రెట్లు పెరిగాయి. తెలంగాణ ఐటీ దిగుమతులు ప్రస్తుతం 29 బిలియన్ డాలర్లు. ఐటీ ఉద్యోగాలు దాదాపు మూడు రెట్లు పెరిగి 9, 00,000కి చేరుకున్నాయి.

రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాలలోపు దేశ జీడీపీ 4.1 శాతం నుంచి 4.9 శాతానికి తెలంగాణ కంట్రిబ్యూషన్ పెరిగింది. ప్రపంచ ప్రఖ్యాత మాగజైన్లు సైతం తెలంగాణ పదేళ్ల ప్రగతి ప్రస్తానాన్ని గొప్పగా కొనియాడుతున్న నేపథ్యంలో, ఇకనైనా కాంగ్రెస్ పాలకులు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పై తప్పుడు ప్రచారాలు నిలిపివేస్తారని ఆశిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సాధించిన అభివృద్ధిని ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నట్లు కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## జులై 7 వరకు కవిత కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 21: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవిత జ్యుడిషియల్ కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఆమె జ్యుడిషియల్ కస్టడీని జులై 7వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.

మద్యం కుంభకోణం కేసులో కవిత జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో కోర్టు ముందు ఆమెను వర్చువల్‌గా సీబీఐ అధికారులు హాజరుపరిచారు. దేశవ్యాప్తంగా



సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మార్చి 15వ తేదీన హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆమె జ్యుడిషియల్ కస్టడీలోభాగంగా న్యూఢిల్లీలోని తీహాడ్ జైల్లో ఉన్నారు. ఆ తర్వాత ఇదే కేసులో ఆమెను సీబీఐ సైతం విచారించింది. ఆ క్రమంలో ఆమె నుంచి కీలక విషయాలను సీబీఐ రాబట్టింది. మరోవైపు ఇదే కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

## సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు నష్టం కలగకుండా చూస్తాం

హైదరాబాద్: బొగ్గు గనుల వేలంతో రాష్ట్ర ప్రభుత్వాల కు కూడా లబ్ధి చేకూరుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బొగ్గు గనుల వేలాన్ని ప్రారంభిం చిన అనంతరం ఆయన మాట్లా డారు. సింగరేణి ఉద్యోగులు, కా ర్మికులకు నష్టం కలగకుండా చూ స్తామన్నారు. సింగరేణిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని వేలం చేపట్టి నట్లు పేర్కొన్నారు. ఆదాయం కోసం మాత్రమే బొగ్గు గనుల వేలం వేయడం లేదన్నారు.

**గత ప్రభుత్వం వేలంలో పాల్గొని గనులు సాధించాల్సింది: భట్టి విక్రమార్క :** గత ప్రభుత్వం వేలం లో పాల్గొని గనులు సాధించా ల్సిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణికి కొత్త బొగ్గు గనులు కేటాయిం చాలని కోరారు. సత్తుపల్లిలో 3, కొయ్యగూడెంలో 3 బొగ్గు గనులు ఉన్నాయన్నారు. ఆరింటిని కేటా యిస్తే సింగరేణికి అనువుగా ఉ



ంటుందని తెలిపారు. బొగ్గు గనుల కోసం ప్రధానిని.. కిషన్‌రెడ్డి ఒప్పిం చాలన్నారు. తాను, సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధానితో మాట్లాడేందుకు వస్తామన్నారు. సింగరేణికి వేలంలో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

**10వ విడత కమర్షియల్ కోల్ మైన్ వేలం ప్రక్రియ ప్రారంభం :** వెస్ట్ ఇన్ హోటల్‌లో10వ విడత కమర్షియల్ కోల్ మైన్ వేలం ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం పాటను ప్రారంభించారు. ఈ వేలంలో బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. సింగరేణి సీఎండీ బలరాం, బిడ్డర్లు సైతం హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 60 బొగ్గు గనుల బ్లాక్‌లను కేంద్రం వేలానికి ఉంచింది. వేలంలో తెలంగాణలోని శ్రావణపల్లి కోల్ మైన్‌ను పెట్టడం జరిగింది. శ్రావణపల్లి కోల్ మైన్‌లో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు గతంలో గుర్తించడం జరిగింది. సింగరేణి సంస్థకే నేరుగా శ్రవణపల్లి బ్లాక్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసింది. వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొంటోందా? లేదా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తెలంగాణలోని శ్రావణ పల్లి బ్లాక్‌ను నేరుగా సింగరేణికి ఇవ్వాలని భట్టి కోరడం జరిగింది.

# కేసీఆర్‌కు సీఎం రేవంత్ భారీ జలక్!

# మళ్లీ మొదలు..!!



## కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి.. మంత్రి పదవి కన్ఫామ్..!

బాన్సువాడ, జూన్ 21: బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీలో కీలక నేత అయిన బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శుక్రవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా పోచారం ఇంటికి వెళ్లారు. పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ ప్రతిపాదనకు అంగీకరించిన పోచారం.. వెంటనే తన తనయుడితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా, ఇవాళో, రేపో మంత్రివర్గ విస్తరణ జరగనుంది. ఈ విస్తరణలో భాగంగా ఆయనకు మంత్రి పదవి ఇస్తామని సీఎం రేవంత్ ఆఫర్ చేశారట. దాంతో ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లు తెలుస్తోంది.

**రైతుల సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లోకి పోచారం..** పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివా స్ రెడ్డిని కలిశామన్నారు. పెద్దలుగా అండగా నిలబడాలని వారిని కోరామన్నారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. రైతుల సంక్షేమంపై వారి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తామని సీఎం చెప్పారు. రైతు రుణమాఫీ విధివిధానాలపై ఇవాళ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోబో తున్నామని సీఎం తెలిపారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి భవిష్యత్‌లో సముచిత గౌరవం ఇస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటామని సీఎం రేవంత్ చెప్పారు. తమది రైతు రాజ్యం అని.. రైతు సంక్షేమ రాజ్యం అని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకునిపోతామని ప్రకటించారు రేవంత్.

**రేవంత్ రైతు పక్షపాతి..** రాష్ట్ర రైతాంగానికి మేలు చేసే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రేవంత్ చేస్తున్న రైతు అనుకూల పనులకు రైతు బిడ్డగా గర్విస్తున్నానని అన్నారు. రేవంత్ యువ నాయకుడు అని.. ఇంకా 20 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించే సత్తా రేవంత్ రెడ్డికి ఉందన్నారు. తాను ఎన్నో పదవులు అనుభవించానని చెప్పారు. రేవంత్ రైతు పక్షపాతి.. రైతుల కోసం పాటుపడే వ్యక్తి అని ప్రశంసించారు పోచారం.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీ వారి మొండి చేయి.. ఏపీ పై కృతజ్ఞత ఏదీ?

కేంద్రంలో మోడీ సర్కారు మూడో సారి ముచ్చటగా కొలువు దీరేందుకు.. ఏపీ కీలకమనే విషయం తెలిసిందే. ఏపీలో వచ్చిన ఎంపీ సీట్లే.. మోడీని కేంద్రంలో కూర్చోబెట్టాయి. కూటమిగా ఎన్నికలకు వెళ్లి.. ఇక్కడి 21 ఎంపీ స్థానాలను మోడీ దక్కించుకున్నారు. వీటిలో బీజేపీకి వచ్చింది మూడే.. కానీ, కూటమి పార్టీలైన టీడీపీకి 16, జనసేనకు 2 స్థానాలు వచ్చాయి. దీంతో సేఫ్‌గా మోడీ అధికారంలోకి వచ్చారు. మరి ఇంత చేసిన ఏపీకి.. ఆయన ఏమేరకు కృతజ్ఞత చూపించారంటే.. మాత్రం పెదవి విరుపులే కనిపిస్తున్నాయి. దీనికి కారణం.. తాజా గా మోడీ సర్కారు తొలి కేబినెట్ సమావేశం నిర్వహించారు. దీనిలో అనేక కీలక ప్రాజెక్టులకు వేలాది కోట్ల రూపాయలను కేటాయించారు. కానీ, ఒక్కటంటే ఒక్కటి ఏపీకి సంబంధించింది లేకపోవడం గమనార్హం. పైగా.. వచ్చే రెండు మూడు మాసాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపైనే మోడీ మరోసారి కరుణ చూపించి.. ఎన్నికల రాజకీయానికి తెరదీశారు.

**నిర్ణయాలు ఏంటి? ఏపీకి ఎలా అన్యాయం జరిగింది?** పోర్టులు, షిప్పింగ్ రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నిధులు కేటాయించారు. వీటిలో మహారాష్ట్రలోని విధావన్ ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ డీప్ డ్రాఫ్ట్ పోర్టు అభివృద్ధికి రూ.76,200 కోట్లను కేటాయించారు. ఏపీలోనూ దుగరాజపట్నం, మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అంత భారీ మొత్తం కాకపోయినా.. 2 వేల కోట్లు కేటాయిస్తే.. ఈ పనులు పూర్తవుతాయి. కానీ, రూపాయి కూడా విదిలించలేదు. ఇక, తమిళనాడు, గుజరాత్‌లో రూ.7,453 కోట్లతో 500 మెగావాట్ల సామర్థ్యంతో చెరొక ఆఫ్‌షోర్ పవన విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీలోనూ అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో పవన విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవి దశాబ్దకాలంగా నిధులు లేక, రాక మూలనపడ్డాయి. దీంతో ఎక్కువ ఖరీదు పెట్టి .. విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాం. ఈ విషయం తెలిసి కూడా.. మోడీ సర్కారు వీటిని పట్టించుకోలేదు. మోడీ సొంత నియోజకవర్గం యూపీలోని వారణాసిలో ఇంటర్నేషన్ ఎయిర్ పోర్టు అభివృద్ధి చేయడానికి రూ.2,869.65 కోట్లను కేటాయించారు. ఏపీలో గన్నవరం ఎయిర్ పోర్టు విషయంలో నిధుల కొరతకారణంగా.. ఇప్పటికీ రైతులకు నిధులు చెల్లించలేదు. అదేవిధంగా విశాఖ ఎయిర్ పోర్టు విస్తరణలో భాగంగా రన్ వే పనులు(3.2 కిలో మీటర్లు) నిధులు లేక ఆగిపోయాయి. వీటికి కూడా.. మోడీ మొండి చేయే చూపించారు. మరి కూటమి పార్టీల ఎంపీలు అడగలేదా.. లేక.. మోడీనే పట్టించుకోలేదా.. అనేది తేలాలి.

# అద్దెకు అగ్నిమాపక వాహనాలు



హైదరాబాద్: పెళ్లి వేడుకకు పెద్దఎత్తున జనాలు హాజరవుతున్నారా..? మీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారా..? మైదానాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారా..? అయితే అక్కడ అగ్నిప్రమాదాల నివారణకు ఫైరింజన్లను అద్దెకు తీసుకోవచ్చు. గంటలు, రోజుల చొప్పున అద్దె చెల్లించి సేవలు పొందొచ్చు. ఇప్పటికే నుమాయిష్, ఎల్బీస్టేడియంలో జరిగే వేడుకలు, సభలకు వాహనాలను(స్టాండ్ బై వెహికిల్స్) అద్దెకిస్తూ అగ్నిమాపకశాఖ ఆదాయం సమకూర్చుకుంటోంది. 2010 సెప్టెంబర్‌లో విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వు 253 మేరకు అగ్నిమాపకశాఖ సేవలందిస్తోంది.

పంపింగ్ సేవలు కూడా.. నీటి పైపులు పగిలిపోయి, ఇతర సందర్భాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరద చేరితే కూడా అగ్నిమాపకశాఖ సేవలను వినియోగించుకోవచ్చు. గేటెడ్ కమ్యూనిటీలు, లోతట్టు ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్‌ల నిర్వాహకులు నీటిని తోడేందుకు పెద్దమొత్తంలో ఖర్చు చేస్తుంటారు. వారు తక్కువ ఛార్జీలతో అగ్నిమాపకశాఖ సేవలు పొందొచ్చు. పంపింగ్ సేవల(నీటిని తోడే)కు గంటకు రూ.2వేలు, రోజుకైతే రూ.20,000 ఛార్జీ ఉంది. కార్నివాల్, నుమాయిష్, ఎల్బీస్టేడియంలో మ్యాచ్‌లు, సభలు, వివాహ, ఇతర వేడుకలకు, సినిమా షూటింగులకు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు.

ఛార్జీలు ఎలా ఉన్నాయి?.. వాహనం పంపే స్టేషన్ నుంచి ప్రదర్శన, వేడుక, సమావేశం జరుగుతున్న వేదిక వరకు కిలోమీటరుకు రూ.20 చొప్పున ప్రత్యేకంగా చెల్లించాలి. నాన్ ప్రాఫిట్, ప్రాఫిట్ సేవల ఆధారంగా గంటకు రూ.1500– రూ.2000, రోజుకు రూ.15000– రూ.20,000 వరకు చెల్లించాలి. అదే పంపింగ్ సేవలకైతే గంటకు రూ.750 నుంచి రూ.1000 చెల్లించాలి. పెళ్లి వేడుకల వద్ద గంటకు రూ.3000, రోజుకు రూ..30,000 చెల్లించాలి. పంపింగ్ సేవలకు గంటకు రూ.1500 చెల్లించాలి. సినిమా షూటింగ్‌లలో పంపింగ్‌కు గంటకు రూ.2వేలు, రోజుకు రూ.20వేలు, స్టాండ్ బై వెహికిల్ సేవలకు గంటకు రూ.3వేలు, రోజుకు రూ.30వేలు చెల్లిస్తున్నారు. విస్తృతంగా పంపింగ్ సేవలు అందించేందుకు అగ్నిమాపకశాఖ ఇటీవలే 8 అధునాతన పంపులను కొనుగోలు చేసింది. మరిన్ని వివరాలకు %https://fire.telangana.gov.in/WebSite/standby.aspx% వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.

ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడమే..

ఈ సేవలకు ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోవాలి. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి 'బుక్ ఫైర్‌స్టాండ్ బై వెహికిల్'పై క్లిక్ చేయాలి. అక్కడ రిజిస్టర్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ నమోదు చేసుకోవాలి. లాగిన్ తర్వాత వెహికిల్ స్టాండ్ బై అప్లికేషన్‌ను క్లిక్ చేసి కేటగిరీ, పేరు, చిరునామా, మొబైల్ నంబర్, ఎప్పటి నుంచి సేవలు అవసరం సంబంధించిన వివరాలను సబ్‌మిట్ చేయాలి. డబ్బు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఈ దరఖాస్తును ఏడీఎఫ్‌వో, డీఎఫ్‌వో, ఆర్‌ఎఫ్‌వో అధికారులు పరిశీలించి అనుమతి జారీ చేస్తారు.

# ప్రత్యేక పరీక్ష.. మహిళకు ఆరోగ్య రక్ష



వికారాబాద్ : మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. దీన్లో భాగంగా 2023లో 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా కొత్తగా 'ఆరోగ్య మహిళా పథకం' ప్రారంభించింది. దీనికింద ప్రతి గుర్తించిన ఆసుపత్రుల్లో మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం మొదలు పెట్టారు. అవసరమైతే పెద్దాసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు. మొదట్లో పెద్దగా ఆదరణ కనిపించక పోయినా ప్రస్తుతం పరీక్షలకు వచ్చే వారి సంఖ్య బాగా పెరిగింది.

అందుబాటులో నిపుణులైన వైద్య సిబ్బంది

జిల్లాలోని గుర్తించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిపుణులైన మహిళా డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, నోటి, రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్, సూక్ష్మ పోషకాల లోపాల గుర్తింపు, అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్ పరీక్ష, ఐరన్ లోపం, విటమిన్ బి12 లోపం, విటమిన్ డీ లోపం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. మూత్రకోశ సంక్రమణ వ్యాధులు, మోనోపాజ్ పరీక్షలు, నెలసరి సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి వైద్యంతో పాటు అవగాహన కల్పిస్తున్నారు. చికిత్సలు అవసరం ఉన్న మహిళలను వికారాబాద్ ఆసుపత్రులకు, ఇంకా అవసరమైతే గాంధీ, నిమ్స్ వంటి ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు. మందులు సూచిస్తున్నారు.

మొదట్లో కేవలం 2000 మంది

ఈ పథకం ప్రారంభించిన దాదాపు ఆరు నెలల వరకు నిర్దేశిత కేంద్రాలకు పరీక్షల నిమిత్తం వచ్చే మహిళల సంఖ్య 2000కు దాటేది కాదు. అలాంటిది ప్రస్తుతం 20,000కు దాటిపోయింది.

గతేడాది జూన్ 20 నుంచి ఈ సంవత్సరం మే 28 వరకు 52 మంగళవారాలు పరీక్షలు జరిపారు.

8 కేంద్రాల్లో పరీక్షల కోసం వచ్చిన వారు: 21,833
పరీక్షలు చేయించుకుంది: 21,668
థైరాయిడ్: 2273
విటమిన్ డి: 915
రొమ్ము క్యాన్సర్ అనుమానితులు: 1486
నోటి క్యాన్సర్ అనుమానితులు: 984

నియోజకవర్గానికి ఒక పీహెచ్‌సీ కేటాయింపు

ప్రారంభంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ః ఆరు నెలల క్రితం మరో 5 కేంద్రాల్లో ధారూర్, యాలాల్, బంట్వారం, కోట్‌పల్లి, చన్‌గోముల్ ప్రారంభించారు.

వికారాబాద్.. రామయ్యగూడ
తాండూరు.. యాలాల
పరిగి.. దోమ
కొడంగల్.. సీహెచ్‌సీ

అందరూ సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ సాయిబాబా, జిల్లా కార్యక్రమ అధికారి


జిల్లాలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక శ్రద్ధతో మహిళా వైద్యులే వచ్చి పరీక్షిస్తారు. వ్యాధి తగ్గే వరకు సూచనలు, సలహాలు ఇస్తారు. దీనిని జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

అన్ని పీహెచ్‌సీలకూ విస్తరించే యోచన

'మహిళా ఆరోగ్య పథకం' కార్యక్రమాన్ని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు విస్తరించాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంది. ఇందుకోసం మహిళా ఎంపీహెచ్‌ఎస్‌లకు శిక్షణ కూడా ఇచ్చారు. జిల్లాలో 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటన్నింటిలో సేవలు ప్రారంభించవచ్చు.

# ఏడాదిగా పెండింగ్‌లోనే!

జగిత్యాల : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సిమెంట్ రహదారులు నిర్మించి ఏడాది దాటినా బిల్లులు రాక పనులు చేసిన వారు అప్పుల పాలయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.66.28 కోట్ల విలువైన 702 పనులు మంజూరు కాగా రూ.20.38 కోట్ల విలువైన 279 సిమెంట్ రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయి. 2023–24 సంవత్సరంలో రూ.36.19 కోట్ల విలువైన 579 రహదారులు మంజూరివ్వగా రూ.13.49 కోట్ల విలువైన 295 రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు సమర్పించినా నిధులు లేని కారణంగా చెల్లింపులు జరగకపోగా పనులు చేసిన ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసినా బిల్లులు రాకపోవడంతో ఎవరికి చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. పనులు చేసేందుకు తెచ్చిన అప్పులు తీర్చలేక వడ్డీ చెల్లించలేక చాలా మంది తిప్పలు పడుతున్నారు. దీనికితోడు రెండు నెలల కిందట జిల్లాకు మరో రూ.30 కోట్ల విలువైన సిమెంట్ రహదారులు మంజూరు కాగా కొందరు పనులు పూర్తి చేయగా మరికొందరు గతంలో చేసిన పనులకే బిల్లులు రాకపోవడంతో పనులు మంజూరైనా మొదలు పెట్టడం లేదు. కాగా ఈ సంవత్సరం కొత్త పనులు మంజూరిచ్చినప్పటికీ ఉపాధి హామీ పనిదినాలతో పోలిస్తే మెటీరియల్ కాంపోనెంట్



సరిపోకపోవడంతో బిల్లులు వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. గతంలో చేసిన పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 90 శాతం నిధులు వచ్చినప్పటికీ గత రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా విడుదల చేయకపోవడం వచ్చిన నిధులను ఇతర పనులకు మళ్లించడంతో ఇబ్బందికర పరిస్థితి ఎదురైనట్లు పేర్కొంటున్నారు. జిల్లాలో పూర్తయిన సిమెంట్ రహదారుల సంబంధించి సుమారు రూ.40 కోట్ల బిల్లులు అధికారులు సమర్పించి ఏడాదైనా రావడం లేదు. ఉపాధి హామీ నిధుల ద్వారా చేసిన సిమెంట్ రహదారుల బిల్లులను వెంటదివెంట పంపించామని జిల్లా పంచాయతీరాజ్ ఈఈ రహమాన్ చెప్పారు.

# రూ.లక్షలు స్వాహా!

జగిత్యాల : జిల్లా కేంద్రంలోని వైద్య విధాన పరిషత్ సాధారణ ఆసుపత్రిలో కొందరు వైద్యులు, ఉద్యోగుల సొమ్మును తోటి ఉద్యోగే స్వాహా చేసిన ఉదంతం చర్చనీయాంశమైంది. సాధారణ ఆసుపత్రిలో వైద్యులు ఇతర ఉద్యోగులకు సంబంధించిన డీఏ, ఇతర చెల్లింపులకు సంబంధించిన నిధులను అకౌంట్స్ విభాగంలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది ఒకరు ఎవరికీ అనుమానం రాకుండా పక్కదారి పట్టించాడు. సుమారు రూ.50 లక్షల మేరకు ఇతర ఖాతాలోకి మళ్లించాడు. అనుమానం వచ్చిన ఆసుపత్రి సూపరింటెండెంట్ సుదక్షిణాదేవి చెల్లింపు వివరాలపై తీయడంతో ఉద్యోగి నిర్వాకం బయటపడింది.

చెక్కులు దిద్ది.. వోచర్లు మాయం చేసి..

అకౌంట్స్ విభాగంలో పనిచేసే రికార్డు అసిస్టెంట్ ఉద్యోగులు, వైద్యులకు సంబంధించిన కొన్ని చెక్కుల్ని సూపరింటెండెంట్ సుదక్షిణాదేవి సంతకం తరువాత బ్యాంకులో విధిగా ఉద్యోగుల ఖాతాలో జమ చేయాల్సి ఉంది. కానీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సంతకం చేసిన తరువాత వోచర్లను మాయం చేసి.. చెక్కులో ఉన్న సొమ్ము వివరాలను చెరిపేసి కొత్తగా అంకెలు వేసి ఆసుపత్రికే చెందిన నిలిచిపోయిన పాత అకౌంట్‌లో జమ చేశాడు. ఓ ఉద్యోగికి చెందిన రూ.8 వేల చెక్కును రూ.8 లక్షలుగా దిద్ది బ్యాంకు ఖాతాలో వేయడం గమనార్హం. ఇలా పలుమార్లు ఉద్యోగుల చెక్కుల్ని వివిధ ఖాతాల్లో జయ చేయడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోకు అనుమానం వచ్చింది. పూర్తి వివరాలు కావాలని కోరడంతో సదరు రికార్డు అసిస్టెంట్ బండారం బయటపడింది.




తోటి ఉద్యోగుల సహకారంపై అనుమానాలు..

వాస్తవంగా ఓ రికార్డు అసిస్టెంట్ హోదా కలిగిన వ్యక్తి రూ.లక్షల కొద్దీ ఉద్యోగుల నిధులను ఇతర ఖాతాల్లోకి యథేచ్ఛగా మళ్లించడంలో తోటి ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది సహకారం ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి అకౌంట్ విభాగంలో రికార్డు అసిస్టెంట్‌పైన జూనియర్ అసిస్టెంట్, యుడీసీ, ఆఫీస్ సూపరింటెండెంట్, ఏఎఫ్‌వో స్థాయి ఉద్యోగులు ఉంటారు. వీరి పరిశీలన లేకుండానే చెక్కుల్ని మార్చి వోచర్లు మాయం చేసే అవకాశం లేదు. ఈ వ్యవహారంలో ఇతర సిబ్బంది పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు చెక్కులో నగదు వివరాలు మార్చి రాసినా బ్యాంకు ఉద్యోగులు ఎందుకు అభ్యంతరం తెలుపలేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. విచారణ చేపడుతున్నాంఆసుపత్రిలో ఓ ఉద్యోగి రూ.లక్షల నిధులు ఇతర ఖాతాలోకి మళ్లించడం మా దృష్టికి వచ్చింది. అతడిని ప్రశ్నిస్తే ఇతర ఖాతాల్లోకి పంపిన నగదు తిరిగి చెల్లించేందుకు అంగీకరించాడు. అయితే ఇప్పటి వరకు ఎన్ని లక్షలు ఏఏ ఖాతాలకు వెళ్లాయి, ఎవరెవరి హస్తం ఉందనే విషయంపై ఆరా తీస్తున్నాం. తప్పు చేసిన ఉద్యోగులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. సుదక్షిణాదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# సిరిసిల్ల, జగిత్యాలలో కేవీకేలు

జగిత్యాల : దేశవ్యాప్తంగా జిల్లాకొక కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) నెలకొల్పాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యవసాయవర్సిటీ చర్యలు చేపట్టాయి. ఇప్పటికే కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, పెద్దపల్లి జిల్లా రామగిరిఖిల్లాలో ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో కేవీకేలు పనిచేస్తుండగా తాజాగా మరోరెండు జిల్లాల్లో కేవీకేల ఏర్పాటుతో కర్షకులకు సాగుసేవలు మరింతగా దరిచేరనున్నాయి.

ప్రయోజనం ఇదివరకున్నవి, నూతనంగా ఏర్పాటు చేసే అన్ని కేవీకేలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా, జిల్లా స్థాయి సమగ్ర వ్యవసాయ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పనిచేసే కేవీకేల నిర్వహణ, జీతభత్యాలను పూర్తిగా కేంద్ర వ్యవసాయ శాఖనే భరిస్తుంది. పరిశోధన స్థానాల్లో అభివృద్ధి చేసిన నూతన వంగడాలను తొలుత కేవీకేల్లోని క్షేత్రాల్లో సాగుచేసి ఫలితాలను సమీక్షిస్తారు. కేవీకేల్లోని శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఫలితాలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన సాగు విధానాలపైనా వీటిల్లో పరిశోధనలు చేపడతారు. భూసార పరీక్ష కిట్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలను రైతులకు అందిస్తారు. వాతావరణ సమాచారం, చీడపీడల నివారణపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తారు. ఒక్కో కేవీకేలో ఒక



సీనియర్ సైంటిస్టు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాస్త్రవేత్తలు ఆరుగురితో పాటుగా ఒక మేనేజర్, ఇద్దరు కార్యక్రమ సహాయకులు, మరోఇద్దరు పరిపాలన సిబ్బంది, ఒక ట్రాక్టర్ డ్రైవర్, ముగ్గురు సాంకేతిక ఉద్యోగులను నియమిస్తారు. ఒక్కో కేవీకేను దాదాపు 50 ఎకరాల్లో ఏర్పాటుచేసే వీలుండగా జగిత్యాల మండలం చల్‌గల్ వాలంతరి క్షేత్రం అనువుగా ఉండనుంది. రైతులు తమపొలాలను ఇచ్చేందుకు ముందుకువస్తే వాటిల్లోనే కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

ఇప్పటికే లభిస్తున్న సేవలు

పూర్వపు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల కేంద్రంగా జగిత్యాల మండలం పొలాసలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం, కరీంనగర్‌లో, పెద్దపల్లి జిల్లా కూనారంలో పరిశోధనస్థానాలున్నాయి. వీటిల్లో వరి, నువ్వులు, మక్క తదితర పంటల విత్తనాల రూపకల్పన, పంటల సరళి, ఎరువులు, నీటి యాజమాన్యం, నూతన సాంకేతికత రూపకల్పనపై పరిశోధనలు సాగుతున్నాయి. మూడు పరిశోధనస్థానాలతో పాటు కరీంనగర్‌లోని ఏరువాక కేంద్రం, వ్యవసాయ డిగ్రీ, వెటర్నరీ పాలిటెక్నిక్, జమ్మికుంట పాలిటెక్నిక్, కోరుట్ల వెటర్నరీ కళాశాల, పొలాసలోని వ్యవసాయ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలు, సిరిసిల్ల జిల్లాలోని వ్యవసాయ కళాశాల, పెద్దపల్లి జిల్లా రామగిరిఖిల్లా ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లోగల శాస్త్రవేత్తలు, పశువైద్యులు, ఇతర నిపుణుల ద్వారా రైతులకు సాగుసంబంధిత సలహాలు అందుతున్నాయి. నూతనంగా రెండు జిల్లాల్లో కేవీకేల ఏర్పాటుతో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ సమాచారం ఒకేచోట లభించి రైతులకు సాగుసంబంధిత సేవలు మరింతగా దరిచేరతాయి.

# వీధి వ్యాపారులకు అడ్డా కరవు!

పెద్దపల్లి : రహదారులపై ఇబ్బందులు తలెత్తకుండా వీధి వ్యాపారులకు ప్రత్యేక ప్రాంతం కేటాయించాలన్న ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు.. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికలతోపాటు ప్రధాన పట్టణాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.. దీంతో రహదారుల పక్కన.. చౌరస్తాల్లో ఎక్కడ పడితే అక్కడ వీధి వ్యాపారులు స్టాల్లు ఏర్పాటు చేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.. ఉమ్మడి జిల్లాలో 1.82 లక్షల వీధి వ్యాపారులు ఉండగా వీరికి ప్రత్యేక జోన్లు లేకపోవడంతో రద్దీ ప్రాంతాల్లో వీరి దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రహదారులు ఇరుగ్గా మారడంతోపాటు రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. వీరికి విక్రయ జోన్లు ఏర్పాటు చేయడం వల్ల ఆ వ్యాపారులంతా ఒకే దగ్గర ఉండే అవకాశంతోపాటు కొనుగోలుదా రులకు వెళ్లడం సులువవుతుంది. పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేక జోన్ల ఏర్పాటుపై దృష్టి పెడితే తప్ప ఈ ఇబ్బందులు తొలగే అవకాశం లేదు

కొనుగోలుదారులు రారనే భయంతో..

వీధుల్లో.. రహదారుల పక్కన విక్రయ బండ్లు, స్టాల్లు ఉంటే కొనుగోలుదారులు వస్తారని.. ఎక్కడో ప్రత్యేక ప్రాంతంలో ఏర్పాటు చేస్తే రారనే ఆందోళనతో చాలామంది వీధి వ్యాపారులు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసిన పట్టణాల్లోనూ అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రత్యేక జోన్లలో తాము దుకాణాలు ఏర్పాటు చేసిన తరవాత తాము ప్రస్తుతం ఉన్న ప్రాంతాల్లో వేరేవారు దుకాణాలు ఏర్పాటు చేస్తే తమ ఉపాధి దెబ్బతినడం భయాందోళనచెందుతున్నారు. అన్ని పట్టణాల్లో అధికారులు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయడంతోపాటు ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ తప్ప వేరే ప్రాంతాల్లో వీధి వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటేనే అందరు వ్యాపారులు సహకరించే



అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

రామగుండం నగరపాలిక పరిధిలో లక్ష్మీనగర్, మార్కండేయ కాలనీ, ఎన్టీపీసీ (జ్యోతినగర్)కి సమీపంలో, బస్టాండ్ వద్ద తాత్కాలికంగా విక్రయ జోన్లు ఏర్పాటు చేసినా పెద్దగా ఉపయోగించుకోవడం లేదు.

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పాత కూరగాయలు, పండ్ల మార్కెట్లను పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్కు తరలిస్తామని చెప్పినప్పటికి అతీగతీ లేదు. రెండేళ్లుగా ఇక్కడ దుకాణ సముదాయాల నిర్మాణం నత్తనడకన సాగుతుండటమే కారణమని వీధి వ్యాపారులు చెబుతున్నారు.

జగిత్యాల, కోరుట్లలో బస్టాండులకు సమీపంలోనే ప్రత్యేక జోన్ల ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినప్పటికి అతీగతీ లేదు. వేములవాడ, సిరిసిల్లలో రహదారుల పక్కనే విక్రయిస్తారు. వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయలేదు.

కరీంనగర్ స్మార్ట్ సిటీ కావడంతో ట్రాఫిక్కు అంతరాయం లేకుండా ఫుట్పాత్లపై రాత్రి వేళల్లో ప్రత్యేకంగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయగా కొంత స్పందన ఉంది. కరీంనగర్ కిసాన్ నగర్లో రెండు, చైతన్యపురి, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక, వేంకటేశ్వరాలయం వద్ద, ఇందిరానగర్, బస్టాండ్ వెనుక ప్రత్యేకంగా జోన్లు ఏర్పాటు చేసినా వ్యాపారులు పెద్దగా ఉపయోగించుకోవడం లేదు.

# కరుగుతున్న గుట్టలు!

సిరిసిల్ల : ప్రకృతి సంపద అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వం నిర్మించే భారీ ప్రాజెక్టులేవీ లేవు. గనులశాఖ నుంచి ఎలాంటి అనుమతులివ్వలేదు. అయినా గుట్టల్లో నిరంతరం మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన కోట్ల రూపాయల రాయల్టీకి గండి పడుతోంది. గ్రానైట్, కంకర క్వారీల మాదిరిగానే మట్టి తవ్వకాలకు అనుమతులిచ్చేలా ప్రతిపాదన చేశారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలో అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న మట్టి తవ్వకాలతో గుట్టలు కరిగిపోతున్నాయి. వేములవాడ మండలం అగ్రహారం, తెట్టెకుంట, చంద్రగిరి, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, సిరిసిల్ల పట్టణం రగుడు పరిధిలోని గుట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వుతూ పురపాలికలు, మండల కేంద్రాల్లో విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్కో టిప్పర్కు దూరాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 5 వేలపైనా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. సాధారణ రోజుల్లోనూ తక్కువగా రవాణా జరుగుతుండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గుట్టల్లో నిరంతరాయంగా సాగుతున్న తవ్వకాలతో అందులోని నెమళ్లు గ్రామాలకు వస్తున్నాయి. ఇటీవల పెద్దూరులోకి వచ్చిన నెమలి ఎండవేడిమిని తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు దప్పిక తీర్చడంతో తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. తెట్టెకుంట, చంద్రగిరి గుట్టల్లో గతంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. గుట్టపై పడిన వర్షపునీరు నిలిచేలా ఉపాధి హామీలో కాంటూరు కందకాలు తవ్వారు. మట్టి తవ్వకాలతో వీటి ఆనవాళ్లేవీ కానరావడం లేదు. ఇక్కడ మట్టి తరలింపునకు ప్రత్యేకంగా ప్రైవేట్ చెక్పోస్టును ఏర్పాటు చేసుకున్నారు.

అటకెక్కిన అనుమతుల ప్రక్రియ

మట్టి తవ్వకాలకు గతంలో మైనింగ్శాఖ ఆన్లైన్లో అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు చేశారు. దీని కోసం జిల్లాల వారీగా ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలకు అనువైన స్థలాలను గుర్తించాలని ఉత్తర్వులు కూడా విడుదలయ్యాయి. దీనికోసం వెబ్సైట్లో ప్రత్యేకంగా పేజీని రూపొందించారు. అందులో భూమి డీజీపీఎస్ సర్వే చిత్రం, ఎమ్మార్వో నుంచి నిరభ్యంతర పత్రం, ఐటీ రిటర్న్లు, గనులశాఖ పాత బకాయిలు లేకుండా చూసుకోవాలి. వీటన్నింటితోపాటు రూ.లక్ష చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి అనుమతులు ఇచ్చాక రూ. 4 లక్షలు చెల్లించాలి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలు వేటికైనా టన్నుకు ఇంత అని ఒక ధరను నిర్ణయిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు అనుమతులు తీసుకునే క్రమంలోనే మట్టి వాడకాన్ని బట్టి సీనరేజీ రూపంలో ప్రభుత్వానికి డబ్బులు జమవుతాయి. తొలుత దీనిపై హడావుడి చేసినా తర్వాత దీని ఊసేలేకుండా పోయింది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అక్రమ మట్టి తవ్వకాలపై దాడులు చేసి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. వారి నుంచి పెనాల్టీ వసూలు చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తున్నాం. జిల్లాలో మట్టి తవ్వకాలకు ఎలాంటి లీజులు లేవు. మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# భూముల విలువ పెంపుదలకు అధ్యయనం




తాండూరు: ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ పెంచాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లు, తహశీల్దార్లు అధ్యయనం ప్రారంభించారు. భూముల విలువ పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అయితే ఈ విలువ ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఆదేశాలు రావడంతో ఆమేరకు అధికారులు కసరత్తు చేపడుతున్నారు.

డిమాండ్ ఉన్న సర్వే నంబర్ల సేకరణ

జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఏరియాను బట్టి వాస్తవ ధరలకు, మార్కెట్లో పలుకుతున్న ధరలకు భారీ వ్యత్యాసం ఉంటోంది. ఈ అంతరాన్ని తగ్గించే విధంగా కసరత్తు మొదలు పెట్టారు. జిల్లాలోని పురపాలిక, మండల, జిల్లా కేంద్రం వికారాబాద్తో పాటు ప్రధాన గ్రామాల్లో డిమాండ్ ఉన్న సర్వే నంబర్లు ఏవి అనే విషయాన్ని అధికారులు సేకరించే ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర, జాతీయ రహదారుల వారగా వ్యవసాయేతరానికి అనువైన ప్రాంతాలు, పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పట్టణాల్లో డిమాండ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి స్థలాలకు విలువ కట్టబోతున్నారు.

నివేదికను కమిటీకి అందిస్తారు

ఈ నెలాఖరు వరకు ఏ సర్వే నంబర్లోని భూమికి ఎంత విలువ పెంచాలనే విషయంలో ఓ నిర్ణయానికి వచ్చి నివేదికను జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్గా ఉండే కమిటీకి అందజేస్తారు. ఈ కమిటీ అభ్యంతరాలు స్వీకరిస్తుంది. సమస్యలను పరిష్కరించాక మార్కెట్ విలువ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేలా చేసి ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్లను అమలు చేస్తారు.

పరిహారం విషయంలో ఆందోళన

భారాస ప్రభుత్వం 2020-21ల రాష్ట్రంలో భూములకు తక్కువ ధరలు ఉన్న ప్రదేశాల్లో 50 శాతం, ఎక్కువ వుంటే 30 శాతం, మధ్యస్తంగా ఉన్న భూములకు 40శాతం చొప్పున ధరలు పెంచింది. జిల్లాలో రహదారులు, ఇతర నిర్మాణ ప్రదేశాల్లో భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం రికార్డుల్లో పేర్కొన్న మేరకు విలువను బట్టి పరిహారం చెల్లించడానికి నిర్ణయం తీసుకుంటుంది. అయితే ఇది సదరు భూ యజమానులకు నచ్చక న్యాయస్థానాలను ఆశ్రయించడంతో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

22న సమర్పించాల్సి ఉంటుంది

భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి ఈనెల 22న ప్రాథమిక నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమేరకు సబ్ రిజిస్ట్రార్లు కసరత్తు ప్రారంభించారు. - అన్వర్, తాండూరు సబ్రిజిస్ట్రార్.

# చేప పిల్లల పంపిణీ జాడేదీ!



పెద్దపల్లి : మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత చేపల పంపిణీ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వానాకాలం ఆరంభమైనప్పటికీ ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో మత్స్యకారులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఆ దిశగా ప్రయత్నాలు కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది ఉచిత చేప పిల్లల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. పథకం ప్రారంభమైన ఎనిమిదేళ్లలో ఏనాడూ సజావుగా అమలు కాలేదు. ప్రతిసారీ ఏదో ఒక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిర్యాదులు పట్టించుకోని ప్రభుత్వం

ప్రతి సంవత్సరం పంపిణీ చేసే చేప పిల్లల పరిమాణం, మోతాదు విషయంలోనూ అధికారులు కచ్చితమైన ప్రమాణాలు పాటించడం లేదు. నిర్ణీత పరిమాణం కన్నా చిన్నగా ఉన్న పిల్లలను పంపిణీ చేయడం, టెండర్ల ప్రక్రియలో గోల్మాల్, చేపల్లో ఎదుగుదల లోపం వంటి సమస్యలపై మత్స్యకారుల ఫిర్యాదులను ప్రభుత్వం పట్టించుకోలేదు. నిబంధనల మేరకు పెద్ద సైజు పిల్లలు 80-100 మి.మీ., చిన్న సైజువి 35-40 మి.మీ. ఉండాలి. కాగా అంతకన్నా తక్కువ సైజున్న పిల్లలను చెరువుల్లో వదలడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిమాణం తక్కువగా ఉండటంతో ఎదుగుదల లోపంతో చిన్న చేప పిల్లలు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

16 వేల మందికి ఉపాధి

జిల్లాలో చెరువులు, కుంటలతో పాటు పార్వతీ (సుందిళ్ల) బ్యారేజీ, శ్రీపాద(ఎల్లంపల్లి) జలాశయాల్లో చేపలు, రొయ్యల పెంపకం చేపడుతున్నారు. మొత్తం 2,001 పురుష మత్స్య సహకార సంఘాల్లో 14,116 మంది, 39 మహిళా సంఘాల్లో 2 వేల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. గడిచిన ఎనిమిదేళ్లలో 913.13 లక్షల చేప పిల్లలు, 152.04 లక్షల రొయ్య పిల్లలు పంపిణీ చేయగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. అయితే మత్స్యకారులకు చేతి నిండా పని దొరికింది. గతేడాది వేసవి ఆరంభంలోనే చాలా చోట్ల నీటి వనరులు అడుగంటడంతో నష్టం వాటిల్లింది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీపై ఇప్పటివరకు స్పష్టత లేకపోవడంతో మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వం అనుమతి ఇస్తే ఏర్పాట్లు

ఏటా చేప పిల్లల పెంపకంతో జిల్లాలో మత్స్యకారులకు ఉపాధి పొందుతున్నారు. చెరువులు, కుంటలు, ఇతర జలాశయాల్లో చేపలు, రొయ్యల పెంపకంతో లాభాలు వస్తున్నాయి. ప్రస్తుత ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తే పంపిణీకి ఏర్పాట్లు చేస్తాం.

# నిధులు రాక.. మరమ్మతు చేపట్టక

మెట్పల్లి : మెట్పల్లి మండలం జగ్గాసాగర్ పెద్దచెరువు ఇది. చెరువులోకి నీరు చేరే మాటు కాలువ దెబ్బతిని వరద కాలువలోకి నీరు చేరుతోంది. మాటు కాలువను పునరుద్ధరించకపోవడంతో చెరువులోకి నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. చెరువు నిండకపోతే భూగర్భ జలాలు తగ్గి పరిసరాల్లోని బోరు బావులు వట్టిపోయే ప్రమాదం ఉందని, తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుపై ఆధారపడ్డ మత్స్యకారుల ఉపాధి కరవవుతుందని పేర్కొంటున్నారు. వరద కాలువ కట్ట, చెరువు మాటు కాలువ మరమ్మతుకు రూ. 21 కోట్లతో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాక తిప్పలు తప్పడం లేదు. గతంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు చెరువులకు నష్టం వాటిల్లింది. కొన్ని చెరువుల కట్టలకు గండ్లు పడగా, మరికొన్నింటి తూములు, అలుగులు దెబ్బతిన్నాయి. తూముల షట్టర్లు శిథిలావస్థకు చేరుకొని తెరచుకోకపోవడంతో వాటి కింద పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. జల వనరుల శాఖ అధికారులు మరమ్మతు కోసం నివేదికలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదించగా, కొన్నింటికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఈ ఏడాది కష్టాలు తప్పేలా లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో సుమారు 1072 చెరువులు, కుంటలుండగా, వీటి కింద వేలాది ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. దెబ్బతిన్న చెరువుల కట్టలు, అలుగులు, తూములకు ఇప్పటి వరకు మరమ్మతు చేపట్టకపోవడంతో ఆయకట్టు చివరి భూములకు సక్రమంగా నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో చెరువుల మరమ్మతుపై దృష్టిసారించాల్సి ఉండగా, నిధులు మంజూరు కాక పట్టించుకునే వారే కరవయ్యారు. మెట్పల్లి మండలం మాదిగకుంటకు రూ. 12.70 లక్షలు, బండలింగాపూర్ పెద్దచెరువుకు రూ. 40 లక్షలు, ఆత్మకూర్ పెద్దచెరువు కట్ట మరమ్మతుకు రూ. 19.30 లక్షలు, ఆత్మకూర్ పెద్దచెరువు శాశ్వత మరమ్మతుకు రూ. 49.40 లక్షలు, చౌలమద్ది కృష్ణాద్రి చెరువుకు రూ. 36.80 లక్షలు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో ఆత్మకూర్ పెద్దచెరువుకు మాత్రమే నిధులు మంజూరై టెండరు దశలో ఉంది.



తాత్కాలిక చర్యలతోనే..

చెరువులకు నిధులు మంజూరు కాకపోవడంతో తాత్కాలికంగా మరమ్మతు చేపడుతూ సరిపెడుతున్నారు. వర్షాకాలం రావడంతో చెరువులకు ముప్పు వాటిల్లకుండా ప్రస్తుతానికి కట్టల వద్ద మొరం, తూములకు మరమ్మతు చేస్తున్నారు. అయినప్పటికీ భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు బుంగలు పడి నీరంతా వృథాగా వెళ్లిపోయింది. కొన్ని చోట్ల తూముల షట్టర్లు లేవకపోవడం, మరికొన్ని చోట్ల లీకేజీ సమస్యలున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం రావడంతో శాశ్వత మరమ్మతులు ఎప్పుడు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శాశ్వత మరమ్మతు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

దెబ్బతిన్న చెరువులు, కుంటల శాశ్వత మరమ్మతుకు ప్రతిపాదనలు పంపించాము. నిధులు రాగానే పనులు చేపడతాము. ఆత్మకూర్ పెద్దచెరువుకు నిధులు మంజూరై టెండరు దశలో ఉంది. పూర్తి కాగానే పనులు చేపడతాము. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాము. అరుణ్కుమార్, డీఈ

# సౌర వెలుగు.. ఆదాయం బాగు

మధిర : మధిరకు చెందిన వ్యాపారి మణికంఠ తన ఇంటిపైన 384 చ.యా. స్థలంలో 10కేవీ సోలార్ ప్యానల్స్ను అమర్చారు. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 90వేల వరకు రాయితీ వచ్చింది. ఈ యూనిట్కు రూ. 5 లక్షల ఖర్చయింది. దీంతో నెలకు వెయ్యి యూనిట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది.

విద్యుత్తు వినియోగం రోజు రోజుకు పెరిగిపోతోంది. అందుకు అనుగుణంగా విద్యుదుత్పత్తి జరగడంలేదు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజనను ప్రవేశపెట్టింది. ఇంటిలోనే సౌరవిద్యుత్తు ఉత్పత్తి చేసి తాము వినియోగించుకోవడంతోపాటు మిగిలిన మొత్తాన్ని విద్యుత్తు సంస్థకు విక్రయించి ఆదాయం పొందవచ్చు. ఇలా మధిరలో పలువురు రాయితీ యూనిట్లు ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈనేపథ్యంలో పథకం తీరుపై కథనం..

సూర్య ఘర్యోజన తీరిది

కేంద్ర ప్రభుత్వం రాయితీతో సౌరవిద్యుదుత్పత్తి యూనిట్లు అందిస్తోంది. యూనిట్లో తయారయ్యే విద్యుత్తు గ్రిడ్కు చేరుతుంది. దీనికి ప్రత్యేకంగా ఒక మీటరును అమర్చుతారు. ఉత్పత్తిలో వినియోగి



ంచినది పోను మిగిలిన విద్యుత్తు యూనిట్లను లెక్క కట్టి వినియోగదారుడి ఖాతాకు సొమ్మును జమచేస్తారు. ఇలా ఆరు నెలలకోసారి జమ అవుతుంది. ఆసక్తి ఉన్నవారు ఆన్లైన్లో దరఖాస్తు చేయాలి. విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలించి అనుమతి ఇస్తారు. ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు మధిర పట్టణంలో మరో 12 మంది వినియోగదారులు ముందుకు వచ్చి సంబంధిత ఏజెన్సీలకు దరఖాస్తు చేశారు. వీరందరికి రాయితీ మీద పథకాన్ని అమర్చేందుకు అనుమతులు లభించాయి. జిల్లాలో పదుల సంఖ్యలో దరఖాస్తులు రాగా 300 దరఖాస్తులకు ఆమోదం లభించినట్లు అధికారులు తెలిపారు.

5కేవీ సోలార్ ప్యానల్స్ అమర్చాం

పెట్రోల్ బంకుకు 5కేవీ విద్యుత్తు తయారయ్యే సోలార్ ప్యానల్స్ను అమర్చాం. ఇది ఐఓసీఎల్ ద్వారా రాయితీపై వచ్చింది. మొత్తం ప్రాజెక్టు రూ. 3.6 లక్షలు కాగా రూ. 1.6 లక్షలు రాయితీ వచ్చింది. మిగతా రూ. 2 లక్షలు చెల్లించాను. ఇక్కడ తయారైన విద్యుత్తు గ్రిడ్కు వెళుతుంది. విద్యుత్తు సంస్థ నుంచి కరెంటు వాడుకుంటున్నాం. ప్రతినెలా రూ. 10వేల వరకు బిల్లు వచ్చేది. రెండు నెలలుగా బిల్లు రాలేదు. లక్కిరెడ్డి సుధాకర్రెడ్డి, మధిర

చాలా మంచి పథకం

కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూర్య ఘర్ యోజన చాలా ఉపయోగకరంగా ఉంది. మా సొంత భవనం మీద 25 ప్యానల్స్ ఏర్పాటు చేశాం. గతంలో మా ఇంటికి రూ. 8వేల వరకు బిల్లు వచ్చేది. ఇప్పుడు జీరో బిల్లు వస్తోంది. ప్యానల్స్ మీద దుమ్ము పడితే నీటితో శుభ్రం చేసుకుంటే మంచిది. కోనా మణికంఠ, మధిర

జిల్లాలో 300 దరఖాస్తులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనకు ఆన్లైన్ ద్వారా జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తుల్లో 300ల మంది వినియోగదారులకు ఫీజుబులిటీ ఉందని గుర్తించాం. వీరందరికి ఈ పథకం వర్తిస్తుంది. ప్రభుత్వపరంగా రాయితీ లభిస్తుంది. త్వరలోనే దీనికి సంబంధించి రెడ్కో సంస్థ పనులు ప్రారంభిస్తారు. వి.సురేందర్, విద్యుత్తు సంస్థ ఖమ్మం ఎస్ఈ

# యథేచ్ఛగా తోడేస్తున్నారు..!

దుమ్ముగూడెం : ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సిన ఇసుక ర్యాంపులో కొందరి స్వార్థం కారణంగా అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిబంధనలను సక్రమంగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం అవేమీ పట్టించుకోకుండా మిన్నకుండిపోతోంది. దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామ పంచాయతీలోని నందులచెలక ఇసుక ర్యాంప్ అక్రమాలకు అడ్డాగా మారింది.

గుత్తేదారుల చేతుల్లోకి...

నడికుడి గ్రామ పంచాయతీలోని నందులచెలక గ్రామ సమీపంలో ప్రభుత్వం అధికారికంగా ఓ ఇసుక ర్యాంపును ఏర్పాటు చేసింది. కొందరు గిరిజన మహిళల పేరిట మైనింగ్ అధికారులు.. 25మంది సభ్యులతో ఓ సొసైటీని ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. గోదావరి ర్యాంపు నుంచి దాదాపు 12ఎకరాల్లో సుమారు 49,500 క్యూబిక్ మీటర్ల ఇసుకను కూలీల సహాయంతో తీసుకెళ్లడానికి గిరిజన మహిళా సొసైటీకి అనుమతులు మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు కథ కొద్దిరోజుల నుంచి ప్రారంభమైంది. ప్రస్తుతం నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇసుక ర్యాంపు నిర్వహణ సాగుతోంది. గోదావరి నది ఒడ్డున ఉన్న ఈ ఇసుక ర్యాంపు కొందరు గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లింది. ఇక్కడ వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది.

సొరంగాలను తలపించేలా..

ఈ ఇసుక ర్యాంప్లో కూలీల సహాయంతో ట్రాక్టర్లలో ఇసుక నింపాలనేది ప్రభుత్వ నిబంధన. ఇది ఇక్కడ మచ్చుకైనా కానరావడం లేదు. గుత్తేదారులు రాత్రిపూట యంత్రాల సాయంతో ఇసుకను తోడేసి టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇలా ఇసుక తోడటంతో గోదావరి పరివాహక ప్రాంతంలో అనేక చోట్ల సొరంగాలను తలపించేలా పరిస్థితి తయారైంది. ఓపక్క వర్షాకాలం ముంచుకొస్తుండడంతో గుత్తేదారులు ముందుచూపుతో వేలాది టన్నుల ఇసుకను అక్రమంగా అనేక ప్రదేశాల్లో నిల్వలు పెడుతున్నారు. టిప్పర్లు, యంత్రాలు యథేచ్ఛగా నదిలో తిరగడానికి అక్రమంగా ఓ రోడ్డునే నిర్మించారు. రాత్రి సమయంలో యంత్రాలతో తరలించడాన్ని నిరసిస్తూ మూడు రోజుల కిందట స్థానిక ప్రజలు అడ్డుకున్నా ఇసుక అక్రమ దందా ఆగటం లేదు. అనుమతులు లేకుండానే ప్రభుత్వ గుట్ట ప్రాంతం నుంచి మట్టి తవ్వకాలు చేసి ఇసుక ర్యాంపునకు రోడ్డును ఏర్పాటు చేసుకున్నా రెవెన్యూ అధికారులు నోరు మెదప లేదనే ఆరోపణలూ ఉన్నాయి.

చర్యలు చేపడతాం

ఇటీవలే ఇసుక ర్యాంపు నిర్వహణకు అనుమతులు మంజూరు చేశాం. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకను తరలించవద్దని నిర్వాహకులను ముందే హెచ్చరించాం. యంత్రాలతో తరలిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై వెంటనే విచారణ జరిపి చర్యలు చేపడతాం. దినేష్కుమార్, కొత్తగూడెం మైనింగ్ ఏడీ







## నిజామాబాద్‌లో సేమ్ సీన్ రిపీట్.. ఆ పార్టీ దుఖానం ఖాళీ..!

హైదరాబాద్, జులై 21: తెలంగాణను సాధించిన పార్టీ.. అప్రతీహతంగా పదేళ్లు రాష్ట్రాన్ని ఏలిన పార్టీ బీఆర్ఎస్‌కు గడ్డుకాలం నడుస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు.. ఆ పార్టీ ఉనికినే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మార్చేశాయి. 39 మంది ఎమ్మెల్యేలు గెలుపొందగా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. దీంతో.. పార్టీ నేతలు పక్క చూపులు చూస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలో చేరేందుకు సిద్ధమైపోతున్నారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు కాంగ్రెస్, బీజేపీల్లోకి వలస వెళ్లగా.. ఇప్పుడు మరికొందరు నేతలు అదే బాటలో ఉన్నారు. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీజేపీలో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం అందుతోంది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఒక అడుగు ముందుగానే ఉందని చెప్పొచ్చు. సీఎం రేవంత్ రెడ్డి అటు పాలనలో.. ఇటు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలోనూ తనదైన మార్క్ చూపిస్తున్నారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్వయంగా కలిసిన ఆయన.. కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. తాజాగా మాజీ మంత్రి, బాన్సువాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి మరీ కలిశారు సీఎం రేవంత్. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. సీఎం ఆహ్వానం మేరకు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయన కుమారుడు భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరి చేరిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పొలిటికల్ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి బాటలోనే బాన్సువాడ బీఆర్ఎస్ శ్రేణులు పయనిస్తున్నాయి. ఆయనతో పాటు కాంగ్రెస్‌లో చేరిపోతున్నారు బీఆర్ఎస్ శ్రేణులు. ఫలితంగా త్వరలోనే బీఆర్ఎస్ శిబిరం ఖాళీ అవనున్నట్లు కనిపిస్తోంది. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానూ ఇదే పరిస్థితి నెలకొంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గ నేతలు సైతం కాంగ్రెస్ వైపు తొంగి చూస్తున్నారు. పోచారం వెంట కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. గతంలోనూ ఇదే సీన్ జరిగింది. అప్పట్లో టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లో(బీఆర్ఎస్) చేరిన మొదటి నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఆయన తరువాత టీడీపీ నేతలంతా టీఆర్ఎస్(బీఆర్ఎస్) బాట పట్టారు. ఇప్పుడు కూడా పోచారం వెంట అదే సీన్ రిపీట్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## పోచారంపై షాకింగ్ కామెంట్స్ చేసిన మాజీ మంత్రి..



హైదరాబాద్ : పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్‌ను వీడటంపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఆయన ఎందుకు పార్టీ మారాల్సి వచ్చిందో తెలియదని అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన జగదీష్ రెడ్డి.. పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడం దురదృష్టకరం అన్నారు. పార్లమెంట్ ఫలితాలు వచ్చిన రోజు కూడా ఆయన కేసీఆర్‌తో సాయంత్రం వరకు ఉన్నారని.. రెండు కూటముల మధ్య ఎన్నికలు జరిగాయని అన్నారని గుర్తు చేశారు. ధైర్యంగా నిలబడాలని కేసీఆర్‌కు పోచారం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు జగదీష్ రెడ్డి. ఏం బలహీనతల వల్ల పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి చేరారో తెలియదన్నారు. ఈ వయస్సులో పోచారం పార్టీ మారుతారని తాము అనుకోలేదని.. ఆయనకు ఏం వస్తుందో తెలియదు కానీ.. అప్రతిష్ట మూట కట్టుకున్నారని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**బీఆర్ఎస్‌తోనే స్టార్ట్ కాలే..** పార్టీ మారే ప్రక్రియ ఒక్క బీఆర్ఎస్ పార్టీతోనే ప్రారంభం కాలేదన్నారు జగదీష్ రెడ్డి. దేశంలో కేసీఆర్‌కు ఎక్కువ మంది శత్రువులు ఉన్నారని అన్నారు. ఆయన కనుమరుగు కావాలని చాలామంది కోరుకుంటున్నారని అన్నారు. ఎవరు పార్టీని వీడినా.. తట్టుకుని నిలబడతామని చెప్పారు బీఆర్ఎస్ నేత.

**వారిని వదిలిపెట్టాలి..** పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్ద బాల్క సుమన్, బీఆర్ఎస్‌ను నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు జగదీష్ రెడ్డి. వారు ఏ నేరం చేయలేదని.. వారిని వెంటనే వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి తమ సహచరుడిగా ఆయన ఇంటికి వెళ్లారని.. మన ఇల్లు, మన నాయకుడు అనే భావనతోనే వెళ్లారన్నారు. సీఎంను ఎవరూ ఏమీ చేయలేదన్నారు. ఆ క్షణం వరకు ఆయన తమ నేత ఇల్లు అని అనుకుని వెళ్లారని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి కేసులు పెట్టకుండా బాల్క సుమన్ సహా అరెస్ట్ చేసిన నేతలను వదిలిపెట్టాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్‌కు ఆ సోయి లేదు..** తెలంగాణ ప్రయోజనాల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఆ సోయి లేదని విమర్శించారు జగదీష్ రెడ్డి. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించొద్దని తాము పోరాటం చేస్తే.. అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. సింగరేణి పరిధిలో బొగ్గు గనులు వేలం వేయడాన్ని తాము ప్రశ్నిస్తే భట్టి తమపై ఎదురుదాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే నిర్ణయం జరిగిందని భట్టి పచ్చి అబద్ధాలు మాట్లాడారని.. బొగ్గు గనులను కొట్టేసే పెద్దలు ఎవరో కాంగ్రెస్, బీజేపీని ఏకం చేస్తున్నారని ఆరోపించారాయన.

**నిన్న ఒక మాట.. నేడు ఒక మాట..** బొగ్గు గనులను వేలం వెయ్యనివ్వమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం నాడు అన్నారని.. ఇవాళ ఆ మాటను మార్చేశారని జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. చెప్పిన దానికి.. చేసిన దానికి పొంతనే లేదన్నారు. శ్రావణి బ్లాక్‌ను వేలం పాట నుంచి తీసేశారో లేదో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు మాజీ మంత్రి. కిషన్ రెడ్డి, భట్టి విక్రమార్క మొసలి కన్నీరు తమకు అవసరం లేదన్నారు.

వెస్ట్ ఇన్ బ్లాక్ హోటల్‌కు వెళ్లిన భట్టి.. శ్రావణి బ్లాక్‌ను వేలం నుంచి తీయించారో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయిన మొదటి రోజే తెలంగాణకు ద్రోహం చేసే పనులు మొదలు పెట్టారంటూ మండిపడ్డారు.

## అప్పుడు కేంద్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే.. భట్టి విక్రమార్కకు సూటి ప్రశ్న

హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బొగ్గు గనుల వేలం బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందనడాన్ని ఖండిస్తున్నానని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి అవగాహన ఉండి కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారా? లేక అవగాహన లేక మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (శుక్రవారం) వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... 2011లో ఆ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిందే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఆ తర్వాత కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు ఆర్డినెన్సు రూపంలో చట్టం చేసిందన్నారు. బిల్లు పెట్టింది కాంగ్రెస్, ఆర్డినెన్సు తెచ్చింది బీజేపీ అని తేల్చిచెప్పారు. భట్టి విక్రమార్క వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. సెక్షన్ 17కింద యాక్షన్ లేకుండా బొగ్గు గనులు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి, భట్టి కేంద్రం వద్దకు వెళ్లాలి..బొగ్గుగని వేలంను ఆపాలని హితవు పలికారు. తాము మద్దతు ఇచ్చాయనే మాటను విక్రమార్క ఉపసంహరించుకోవాలని కోరారు. సింగరేణిని చంపేయడానికి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి సంబంధించిన 8మంది ఎంపీలను గెలిపించారా అని ప్రశ్నించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జ్‌లు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్‌లు, డివిజన్ ఇంచార్జ్‌లతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

బెంగళూరు: కర్ణాటక క్యాడర్‌కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి మరో వివాదంలో చిక్కుకున్నారు. తన భూమిని ఆక్రమించారని ఆరోపిస్తూ ఆమెపై బాలీవుడ్ గాయకుడు లక్కీ అలీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు కాపీని ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. బెంగళూరు శివారులోని యెలహంక ప్రాంతంలో తన వ్యవసాయ భూమిని ఐఏఎస్ రోహిణి, ఆమె భర్త సుధీర్ రెడ్డి, బంధువు మధుసూదన్ రెడ్డి అక్రమంగా లాక్కొన్నారని లక్కీ అలీ ఆరోపించారు. ఇందుకు కొందరు స్థానిక పోలీసు అధికారులు ఆమెకు సాయం చేసినట్లు తెలిపారు. 2022లోనే దీనిపై తాను కేసు పెట్టినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే తాను లోకాయుక్త పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. గాయకుడి ఫిర్యాదుతో యెలహంక న్యూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. గతేడాది ఐపీఎస్ రూపా మౌద్గిల్‌తో వివాదంతో ఐఏఎస్ రోహిణి సింధూరి వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. రోహిణి వ్యక్తిగత చిత్రాలను బయటపెడుతూ ఐపీఎస్ రూప చేసిన ఆరోపణలు.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ముందు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. రూప ఆరోపణలకు రోహిణి కూడా సోషల్ మీడియాలో దీటుగా స్పందించారు. తనకు వ్యతిరేకంగా ఆరోపణలు చేసి, సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టిన రూప తనకు క్షమాపణలు చెప్పాలని, దాంతో పాటు రూ.కోటి ఇవ్వాలని రోహిణి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం కాస్త తీవ్ర దుమారం రేపడంతో అప్పటి ప్రభుత్వం వీరిపై చర్యలు తీసుకుంది. వీరిద్దరికీ ఎలాంటి పోస్టులు కేటాయించకుండా బదిలీ వేటు వేసింది.

## బాల్క సుమన్ అత్యుత్సాహం..పోలీసులతో గొడవ, అరెస్ట్



మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ ఇంటి దగ్గర బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. ఆ క్రమంలో పోచారం ఇంట్లోకి బీఆర్ఎస్ నేతలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బాల్క సుమన్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నేతలను అడ్డుకోగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఎంత సేపటికీ వినకపోవడంతో బాల్క సుమన్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

అయితే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సమాచారం తెలుసుకుని ఆయన ఇంటి వద్దకు చేరుకుని బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అప్పటికే పోచారం సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి చేరుకుని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే ఈసారి ప్రకటించనున్న మంత్రి వర్గంలో పోచారానికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## మూడు తరాల ఉద్యమకారులకు ప్రేరణ ప్రొఫెసర్ జయశంకర్ సార్ : కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణనే స్వప్నించి, శ్వాసించి మూడు తరాల ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచిన మహా మనిషి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ కొనియాడారు. సార్ వర్ధంతి సందర్భంగా ఆయనకు అశ్రునివాళులర్పిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు. జూన్ 21, 2011న జయశంకర్ సార్ కన్నుమూశారు.

## ప్రత్యర్థులే లక్ష్యంగా ఐటీ, ఈడీ దాడులు.. హరీష్ రావు ఫైర్..



హైదరాబాద్, జూన్ 21: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆయన తమ్ముడు మధుసూదన్ రెడ్డిని పరార్మించారు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు. గూడెం బ్రదర్స్ ఇళ్లలో గురువారం ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వారిని పరామర్శించారు హరీష్ రావు. ఈడీ తనిఖీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీష్ రావు.. అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఈడీ, ఐటీ దాడులతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఎలాంటి అవినీతి ఆస్తులు దొరకలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీహార్, గుజరాత్‌లలో నీట్ ప్రశ్నపత్రాలను అమ్ముకున్నారని.. ప్రశ్న పత్రాలు లీక్ అవుతున్నా అధికారులు ఎందుకు వారిపై దాడులు చేయడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. దేశంలో 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని.. వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా ఉందన్నారు. నీట్ ప్రశ్నాపత్రాలు లీక్ చేసిన వారిపై ఈడీ, ఐటీ దాడులు ఎందుకు చేయడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేరాలని ఒత్తిడికి గురిచేస్తుందని ఆయన ఆరోపించారు. ఇంటెలిజెన్స్, ఫోన్స్ ద్వారా వివరాలు సేకరిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టార్గెట్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాహుల్ గాంధీ చేతుల మీదుగా విడుదల చేసిన మేనిఫెస్టోను రేవంత్ సర్కార్ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోబోమని చెప్పి.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీ మారాలని వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చాలా ధైర్యంగా ఉన్నారని.. ఆయన ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ఈడీకి ఎలాంటి ఆస్తులు దొరకలేదన్నారు. ఇంట్లో చిన్న పిల్లలు ఏడుస్తున్నా కర్కశంగా ఎమ్మెల్యే ఇంట్లో ఈడీ దాడులు చేయడం దారుణం అన్నారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని.. ధర్మం గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు హరీష్ రావు.

## శరీరాన్ని, మనసును కలిపే ప్రక్రియ యోగా: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: యోగా అంటే శరీరాన్ని, మనసును కలిపే ప్రక్రియ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన యోగా మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాణులు ప్రకృతితో మమేకమవ్వడమే యోగా అంతరార్థమని తెలిపారు. ఇవాళ ప్రపంచమంతా యోగా వైపు చూస్తోందని చెప్పారు. యోగా అలవాటు చేసుకుంటే విజయాలన్నీ చేకూరతాయన్నారు. ప్రధానిగా మోదీ నిర్ణయాన్ని ప్రపంచమంతా ఆచరిస్తోందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. మోదీ వల్ల యోగాకు అన్ని దేశాల్లో ప్రాముఖ్యత లభించిందని తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ నేర్చుకోవాల్సిన విద్య యోగా అని వివరించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమలో తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చినజీయర్ స్వామి పాల్గొన్నారు. కరీంనగర్‌లోని



జ్యోతినగర్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొని యోగాసనాలు వేశారు.

## మాజీ స్పీకర్ పోచారం ఇంటి వద్ద ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతల దాడి



హైదరాబాద్: మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. శుక్రవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని జంబారాహిల్స్‌లోని శ్రీనివాస్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ నేతలతో కలిసి అక్కడి వెళ్లారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆయన నివాసంలోకి వెళ్లకుండా నిలువరించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. కాంగ్రెస్ గూండాలు బాల్కసుమన్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులపై దాడికి పాల్పడ్డారు. పరిస్థితి అదుపుతప్పుతుండటంతో బాల్కసుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, బాలరాజు యాదవ్, రాకేశ్ కుమార్‌తోపాటు పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకితీసుకుని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660